క్లుప్తంగా

నేటి నుంచి ఏటి గంగమ్మ జాతర



ఆలయంలో గొడుగులకు సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

తలుపుల: మొలకల పౌర్ణమి సందర్భంగా స్థానిక ఎగువపేట సమీపంలో ఏటి గంగమ్మ జాతర శుక్రవారం నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయంలో అమ్మవారి నూతన గొడుగులకు సంప్రోక్షణ చేపట్టారు. జాతర ఆదివారం వరకూ జరుగుతుందని అర్చకుడు లక్ష్మీ నరసింహస్వామి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి అమ్మవారి గొడుగుల ఊరేగింపు ప్రారంభమై.. బలిజపేట, ఓబీఆర్ రోడ్ ఆంజనేయస్వామి గుడి వరకూ సాగుతుందని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి సారె చీర అందించడం జరుగుతుందని తెలిపారు. అక్కడి నుంచి సాయంత్రం చెల్లెళ్లు అయిన చింతల గంగమ్మ, గాండ్లపెంట గంగమ్మకు సారె చీర అందించి ఆహ్వానిస్తారు. రాత్రికి ఏటి గంగమ్మకు మొలకలు నోమే కార్యక్రమం, గంగమ్మ కథ కాలక్షేపం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

సమన్వయంతో పని చేయాలి



సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి

ధర్మవరం రూరల్: మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్య సాధనకు కచ్చితమైన నివేదికలు ఇవ్వాలని బత్తలపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, డాక్టర్ తేజశ్రీ సూచించారు. గురువారం బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, ఐసీడీఎస్, మహిళా పోలీస్, వలంటీర్లు, విలేజ్ హెల్త్ సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఫీవర్ సర్వే విధిగా నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు చిన్నారులకు అందించే అన్ని రకాల ఆరోగ్య సేవల్ని ఆర్‌సీహెచ్ పోర్టల్లో విధిగా అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల్ని సకాలంలో అర్హులైన లబ్ధిదారులకు అందించి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ముదిగుబ్బలోని 14, 15, 16 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మలగుండ్ల భాస్కర్, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు చంద్రాయుడు, కిరణ్ కుమార్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆనంద్, చిన్ననాయుడు, చంద్ర పాల్గొన్నారు.

రీ సర్వేకు 5 గ్రామాల ఎంపిక



సూచనలు ఇస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వేకు గోరంట్ల మండలంలోని 5 గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో రీ సర్వే అధికారులకు గ్రామాల వివరాలను అందజేశారు. రెండో విడతలో భాగంగా గోరంట్ల మండలంలోని పులేరు, మేరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, జక్కసముద్రం, భూగానిపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సదరు గ్రామాలకు సంబంధించి డీఆర్‌వి షీట్స్, స్కెచ్‌లు, రికార్డులను అందజేశారు. రీసర్వేను త్వరగా పూర్తి చేసి స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందరినీ సమన్వయం చేసుకుని రీ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఓఎస్ శేఖర్ పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

కొత్తచెరువు: సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం సంగమేశ్వర స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సంగమేశ్వర దేవాలయంలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల నడుమ స్వామికి కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్త మనోహర్, నటరాజ్ స్వామికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. సంగమేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారన్నారు.



కొత్తచెరువు: సంగమేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యల్లమ్మ తిరునాల ప్రారంభం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో యల్లమ్మ తిరునాల గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుద్దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

యల్లమ్మ తిరునాల సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, కో–ఆప్షన్ సభ్యుడు సుబహాన్, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, నాయకులు తిరుమల నాయుడు, వెంకటేశ్వర్లు, నారాయణ స్వామి, వెంటనారాయణ రెడ్డి, కిష్ట, ఆలయ నిర్వాహకులు శివారెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం

కొత్తచెరువు: మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలో గురువారం లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తండ్రి దుద్దుకుంట వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రథంలో ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. భక్తులతో కలిసి రథాన్ని లాగారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పోతిరెడ్డి పాల్గొన్నారు.



ఎన్పీకుంట: కొలువుదీరిన యల్లమ్మ దేవత



ధర్మవరం అర్బన్: అలంకరణలో దుర్గమ్మ దేవి

దుర్గమ్మ పరుష ప్రారంభం..

ధర్మవరం అర్బన్: పట్టణంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం ముగిసిన అనంతరం నిర్వహించే దుర్గమ్మ పరుష మూడు రోజుల పాటు జరుగుతుంది. గురువారం దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలువురు భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం దేవాలయం ముందుభాగంలో ప్రధాన రహదారులపై వెలసిన దుకాణాలన్నీ ప్రజలతో కిటకిటలాడాయి. గాజుల దుకాణాలు, బొమ్మలు, ఇంటి సామగ్రి, ఇంటి అలంకరణకు ఉపయోగపడే పూలు, ఇతరత్రా వస్తువుల కొనుగోలుకు ఆసక్తి చూపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పరుషకు పట్టణం నుంచే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



యల్లమ్మ దేవికి పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి





కొత్తచెరువు: లక్ష్మీ నరసింహస్వామి రథాన్ని లాగుతున్న దుద్దుకుంట వెంకటరామిరెడ్డి, ధర్మవరం అర్బన్: దుకాణాల వద్ద మహిళల సందడి

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

కనగానపల్లి: మండలంలోని తగరకుంట, వేపకుంట గ్రామాల్లోని 35 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం అనంతపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నట్లు మండల కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో తగరకుంట నేసే నాగన్న, మారెన్న, శివయ్య, అంజీ, వేపకుంట వెంకటప్ప, తదతరులు ఉన్నారు. 25 ఏళ్లుగా టీడీపీలో పని చేస్తున్నా పరిటాల కుటుంబం తమకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వపాలన నచ్చి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తగరకుంట ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం



తిప్పారెడ్డి



పెయింటర్ కేశవ



గోపాల్‌రెడ్డి

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలోని 6 మండలాలకు పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్ల నియామకం చేపట్టినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. గురువారం కొత్తచెరువు మండల పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్, కో–కన్వీనర్ల నియామకం పూర్తి చేశారు. కొత్తచెరువు మండల బూత్ లెవల్ కన్వీనర్‌గా తిప్పారెడ్డి, కో–కన్వీనర్లుగా పెయింటర్ కేశవ, మైలసముద్రానికి చెందిన గోపాల్‌రెడ్డిని నియమించారు. తమపై నమ్మకం ఉంచి పదవులు కట్టబెట్టిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

స్వార్థ రాజకీయాల కోసమే రాజీనామా డ్రామా

నల్లచెరువు: ఓరువాయి గ్రామంలో ఉప సర్పంచ్ బయారెడ్డి, వార్డు మెంబరు రాజీనామా.. కాంగ్రెస్ మండల కన్వీనర్ ఎంఆర్ అంజనప్ప ఆడించిన డ్రామా అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి అన్నారు. మారిశెట్టి పల్లికి చెందిన వలంటీర్ రాధిక స్థానికంగా లేకుండా విధుల్లో అలసత్వం వహించడంతో గత నెల 30వ తేదీన అధికారులు విధుల నుంచి తొలగించారని తెలిపారు. అయితే ఉప సర్పంచ్, బయ్యారెడ్డి, వార్డు మెంబర్ రామాంజినేయులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కుమార్తె అయిన వలంటీర్ రాధికను అధికారులు తొలగించడంతో కన్వీనర్ అనుచరులైన ఉప సర్పంచ్ బయారెడ్డి, వార్డు మెంబర్‌తో రాజీనామా నాటకం ఆడించారన్నారు. రాజీనామా చేయాలనుకున్న వారు విడివిడిగా రాజీనామా పత్రాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఇద్దరూ కలిసి ఒకే పత్రంలో రాజీనామాలను అందజేయడంతో అది డ్రామాగా తేలిపోయిందన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విధులకు డుమ్మా కొడుతున్న వలంటీర్ రాధిక..

గతవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఓరువాయి గ్రామంలో మారిశెట్టిపల్లి, చెరువు వాండ్లపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పర్యటించారు. అప్పుడు కూడా వలంటీర్ రాధిక రాలేదని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన స్పందనను చూసి ఓర్వలేక కాంగ్రెస్ మండల కన్వీనర్ కొందరితో కలిసి వారి స్వార్థ రాజకీయాల కోసం రాజీనామా డ్రామా ఆడించారన్నారు.

మహమ్మదాబాద్‌లో పోలీసుల తనిఖీలు

అమడగూరు: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం సరిహద్దు గ్రామాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మహమ్మదాబాద్, ఎస్సీ కాలనీల్లో ఎస్‌ఐలు వెంకటనారాయణ, గోపి సిబ్బందితో కలసి పర్యటించారు. ఈనెల 10వ తేదీన కర్ణాటకలో ఎన్నికలు జరుగుతాయన్నారు. డబ్బు, మద్యం, ఇతరత్రా నిల్వ ఉన్నట్లయితే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామని తెలిపారు. మద్యం, డబ్బును తీసుకెళ్తూ పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

రామగిరి: చట్టాన్ని ఉల్లంగిస్తే ఎలాంటి వారైనా చర్యలు తప్పవని సీఐ చిన్నగౌస్, ఎస్‌ఐ జనార్దన్ నాయుడు హెచ్చరించారు. గురువారం కర్ణాటక సమీపంలోని గరిమేకలపల్లిలో యాదవకుల దేవత వీర ఓబమ్మ జాతర సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా కర్ణాటక రాష్ట్రం తిరుమణి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమమోహన్ రెడ్డి

కొత్తచెరువు: ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమ మోహన్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో వసతులు, పరిస్థితులను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ప్రతి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్.ఎం.మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నరసింహారెడ్డి, గ్రంథాలయ అధికారి జయరాం, వైఎస్సార్ సీపీ నాయకుడు వాల్మీకి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

కొత్తచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్మీకి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గురువారం గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉమ, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎల్.ఎం.మోహన్ రెడ్డి తదితరులు శంకర్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

పుట్టపర్తి టౌన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తోందని డీపీటీఓ మధుసూదన్ పేర్కొన్నారు. భక్తుల కోరిక మేరకు వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను గురువారం పుట్టపర్తి బస్టాండ్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల కోరిక మేరకు పండుగుల, జాతరలు, గిరిప్రదక్షణలు, తిరునాలకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా తిరువణ్ణామలకు జిల్లాలో అన్ని డిపోల నుంచి 10 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు సిబ్బంది కూడా కృషి చేయాలన్నారు. అవసరాలను బట్టి 30 మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే అదనపు చార్జీలతో ఏ గ్రామం నుంచి అయినా బస్సులు నడుపుతామన్నారు. మెబైల్ ద్వారా కూడా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనాయతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీపీటీఓ మధుసూదన్

సబ్జెక్టులపై పట్టు సాధించాలి

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌టీఈఎమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) కార్యక్రమాన్ని ఆర్డీఓ రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓతో పాటు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, ఎంపీడీఓ సుధామణి, మండల విద్యాధికారి చెన్నకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ సబ్జెక్టులు సులభంగా అర్థం చేసుకోవడానికి స్టెమ్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోపడుతుందన్నారు. వీటికి సబంధించి మొత్తం కదిరిలో 5 పాఠశాలల్లో ల్యాబ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు విపులంగా బోధిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, వరప్రసాద్‌రాజు,జనార్దన్ పాల్గొన్నారు.



'స్టెమ్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

పుట్టపర్తి: సచివాలయాల ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం ఆయన బుక్కపట్నం మండలంలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. యూనిఫాం వేసుకోకుండా విధులకు హాజరయ్యే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం జగనన్న కాలనీలలో నిర్మాణాలను పరిశీలించారు.

వీఓఏలకు శిక్షణ

అమడగూరు: మండలంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఏపీఎం గోపాల్ ఆధ్వర్యంలో వీఓఏలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. లోకోస్ అనే మొబైల్ యాప్‌పై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. లోకోస్ అంటే ప్రజల చేత నిర్వహించబడేదని అర్థమన్నారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా సంఘాల పుస్తకాల నిర్వహణ, పుస్తకాల ఆవశ్యకత, ఎన్ఆర్ఎల్ఎం ఆవిర్భావ చరిత్ర, ఎస్‌హెచ్‌జీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, లోకోస్ యాప్ ద్వారా ఆశిస్తున్న ఫలితాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అనూష, సీసీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'గడప గడపకూ మన ప్రభుత్వం' రేపు

ఎన్పీకుంట: మండల కేంద్రంలో ఈనెల 6వ తేదీన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్.పీ.కుంట–1 సచివాలయం పరిధిలో ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

6న ఉచిత కంటి వైద్య శిబిరం

రామగిరి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈనెల 6న శనివారం శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పెటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మీనుగ నాగరాజు గురువారం తెలిపారు.

మండల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ అంజలి

చెన్నేకొత్తపల్లి: మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని మండల అధ్యక్షురాలు మజ్జిగ అంజలి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంల ఎంపీడీఓ అశోక్ నాయక్, ఏఓ ఉదయ్ కుమార్, హౌసింగ్ ఎఈ హరి నాయక్, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు డోలు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గాయత్రి, ఏపీఎం రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న దామాజిపల్లి గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: గ్రామంలో మేము సొంతంగా కాలనీ వాసులంతా చందాలు వసూలు చేసుకొని డ్రైనేజీ కట్టుకుంటే పరిటాల సునీత సొంత నిధులతో నిర్మించారని పత్రికల్లో తప్పుడు కథనాలు రాయించడం సరికాదని దామాజిపల్లి గ్రామస్తులు అన్నారు. గ్రామస్తులు అక్కమ్మ, రాజి, నారాయణమ్మ, భారతి, గౌరమ్మ, లక్షన్న, నారాయణ, నిత్య, నాగేష్ తదితరులు గురువారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా కాలనీలో డ్రైనేజీ సమస్య ఉండటంతో కాలనీ వాసులంతా స్వచ్ఛందంగా చందాలు వేసుకొని రూ.40 వేలు డబ్బు పోగేసుకొని డ్రైనేజీ నిర్మించుకున్నామన్నారు. డ్రెయినేజీ వద్ద టీడీపీ నాయకులు ఫొటోలు దిగి మాజీ మంత్రి పరిటాల సునీత సొంత నిధులతో నిర్మించారంటూ పచ్చపత్రికల్లో రాయించడం సరికాదన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ పవన్‌కుమార్‌రెడ్డి మాకు రూ.40 వేలు తిరిగి ఇచ్చారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని ఒకటో నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ ఆదినారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, మూడు సంవత్సరాల్లోపు పిల్లల వివరాలపై ఆరా తీశారు. పౌష్టికాహారం సరిగా అందుతోందా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అందించాలని కార్యకర్తను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మనోహర్, మహిళా పోలీస్ లలితకళ, కార్యకర్త శోభ తదితరులు పాల్గొన్నారు.